సాక్షి
తిరుపతి
సోమవారం । 25 । నవంబర్ । 2024



'సాక్షి' మ్యాథ్స్ బీ.. స్పెల్‌బీ..

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ పరీక్షలు నిర్వహించారు. - 8లో



ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

చిన్నగొట్టిగల్లు మండలంలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. పంటలను నాశనం చేసింది. - 8లో



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

శ్రీకాళహస్తి పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను చెన్నైకి తరలించేస్తున్నారు. - 8లో

సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు కల్లబొల్లి కబుర్లు వల్లించారు. నిరుపేదలకు అండగా ఉంటామని ఊదరగొట్టారు. తిరుపతిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చిలక పలుకులు పలికారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచుతున్నారు. అక్రమార్జనే లక్ష్యంగా అరాచకాలకు తెగబడుతున్నారు. కాసుల కోసం చిరువ్యాపారులను సైతం పీడిస్తున్నారు. నగరంలోని శ్రీనివాసం.. విష్ణునివాసం అడ్డాగా మార్చుకుని తోపుడు బండ్ల వారిని వేధిస్తున్నారు. రోజువారీ మామూళ్లను వసూలు చేస్తూ బడుగుజీవులను దోచుకుంటున్నారు. శీతల పానీయ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వైన్‌షాపు యజమానులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. చివరకు చికెన్ వేస్టేజీని సైతం వదిలి పెట్టకుండా నెలవారీగా రూ.లక్షలు గుంజుతున్నారు. అధికార పార్టీ నాయకుల రౌడీయిజానికి జనం బెంబేలెత్తిపోతున్నారు.



ఆధ్యాత్మిక నగరిలో.. అరాచకాలు

యథేచ్ఛగా కూటమి నేతల దందా

- శ్రీనివాసం.. విష్ణునివాసం అడ్డాగా వసూళ్లు
- చిరు వ్యాపారుల ముక్కు పిండి మామూళ్లు
- వైన్‌షాపుల వద్ద కూల్ డ్రింక్ దుకాణాల ఏర్పాటుకు దౌర్జన్యాలు
- చివరకు చికెన్ వేస్టేజీని సైతం వదిలిపెట్టని అధికార పార్టీ నాయకులు
- కాసుల కోసం తెగబడుతూ ఇష్టారాజ్యంగా బెదిరింపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో అధికారపార్టీ నేతల అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పనులు, పదవులు, వ్యాపారాలు చేసుకోవాలన్నా మామూళ్లు ఇవ్వాల్సిందే. చివరకు చిరు వ్యాపారులను సైతం వదలడం లేదు. కొందరి నుంచి రోజు వారీ, మరి కొందరి నుంచి మూడు రోజులకు ఒకసారి సొమ్ము వసూలు చేస్తున్నారు. లేకుంటే వ్యాపారాలను సజావుగా సాగనిచ్చే పరిస్థితిలేదు. మామూళ్ల విషయం తెలిసి కార్పొరేషన్ కమిషనర్ ఇటీవల ఓ ప్రకటన జారీ చేశారు. నగరపాలక సంస్థ పేరు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు . అయినప్పటికీ.. తిరుపతి నగరంలో చిత్తూరు నుంచి వచ్చిన కొందరు కూటమి నాయకులు స్థానిక నేతల సహకారంతో యథేచ్ఛగా దందాలు కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే.. టీడీపీ, జనసేనకు చెందిన కొందరు సాగిస్తున్న అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. మొన్నటికి మొన్న మద్యం షాపులు దక్కించుకున్న వారిని వాటాల కోసం బెదిరించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వైన్‌షాపుల పక్కన కూల్ డ్రింక్ దుకాణాలు పెట్టుకుంటామని ఆ వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నారు. టెండర్ల ద్వారా వైన్‌షాపు రాకపోయినా పక్కన కూల్ డ్రింక్ దుకాణం పెట్టుకుంటే.. అనధికారికంగా మద్యం అమ్మకాలు కొనసాగించి డబ్బులు సంపాదించుకోవచ్చని ప్రధానంగా జనసేన నేతల ప్లాన్. అయితే ఒకరిద్దరు ససేమిరా అంటుంటే.. మరి కొందరు వీరి ఒత్తిడికి లొంగిపోయారు.

వ్యర్థాలను వదలని నాయకుడు

తిరుపతిలో జనసేనకు చెందిన ఓ నేత చికెన్ షాపుల్లోని వేస్టేజీని వదలడం లేదు. నగరంలో సుమారు 1,500కిపైగా చికెన్ సెంటర్లు ఉంటాయి. వీటి ద్వారా వచ్చే టన్నుల కొద్దీ చికెన్ వేస్టేజ్ వస్తుంటుంది. ఈ చికెన్ వేస్టేజీని రొయ్యలు, చేపలకు ఆహారంగా వినియోగిస్తుంటారు. అందుకే ఈ వేస్టేజీకి మంచి డిమాండ్ ఉంది. ఈ వ్యర్థాల ద్వారా ప్రతి రోజూ రూ.50వేల నుంచి రూ.75వేల వరకు ఆదాయం ఉంటోంది. విషయం తెలుసుకున్న జనసేన నాయకుడు ప్రతి ఐదు డివిజన్లకు ఒకరికి చికెన్ వేస్టేజీ బాధ్యత అప్పగించారు. అలా తిరుపతి నగరంలోని చికెన్ షాపుల నుంచి ఎప్పటికప్పుడు వేస్టేజీ తరలింపును పర్యవేక్షిస్తుంటారు. ఇందుకోసం లీజుని ఓ 'నాయుడు' పేరున తీసిచ్చారు. కేవలం చికెన్ వేస్టేజ్ ద్వారా జనసేన నేతకు ప్రతి నెలా రూ.15 లక్షలు ముడుతున్నట్లు ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

అర్ధరాత్రి దాటినా..

నగరంలో జనసేన, టీడీపీ నాయకులకు చెందిన కొన్ని హోటళ్లు అర్ధరాత్రి దాటి 2 గంటలవుతున్నా తెరిచే ఉంటాయి. ముఖ్యంగా రైల్వేస్టేషన్ పరిధిలోని ఓ హోటల్, రెస్టారెంట్ 24 గంటలు తెరిచే ఉంటారనే ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్ పరిధిలోని ఓ హోటల్ తెల్లవారు జాము వరకు ఉంటుందని, దీన్ని మందుబాబులకు అడ్డాగా మార్చారనే ప్రచారం ఉంది. అధికార పార్టీకి చెందిన అనుచరులకు చెందిన లాడ్జిల్లో పేకాట సైతం నిరంతరరాయంగా సాగుతోందని సమాచారం. కూటమి నేతల అక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని తిరుపతి వాసులు కోరుతున్నారు.

ఓ నేత చిల్లర వేషాలు

తిరుపతి నగరంలో ఫుట్ పాత్‌లపై కొందరు చిరు వ్యాపారులు చిన్న చిన్న బండ్లు పెట్టుకుని కొబ్బరి బోండాలు, టిఫిన్, బజ్జీలు, ఇతర తినుబండారాలు విక్రయించి కుటుంబాలను పోషించుకుంటుంటారు. వారి వద్ద నుంచి ఓ నేత తన అనుచరుల ద్వారా రోజూ డబ్బులు వసూలు చేసుకుంటున్నట్లు తెలిసింది. అంతంత మాత్రం వ్యాపారం జరుగుతుంటే అందులోనూ వాటా కావాలని, ఇవ్వకపోతే బండిని ఎత్తేయిస్తామని బెదిరిస్తున్నట్లు ఓ మహిళ కన్నీరు మున్నీరైంది. ఇదిలా ఉంటే.. శ్రీనివాసం, విష్ణునివాసం చుట్టూ ఒకరిద్దరు చిరు వ్యాపారాలు సాగించుకుంటుంటే.. వారి మాటున జనసేన నాయకుడు తన అనుచరుల ద్వారా బండ్లు ఏర్పాటు చేయించి దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగజ్జీవన్‌రాం, పద్మావతి పార్కు పరిసర ప్రాంతాల్లో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న బండ్ల వద్ద నుంచి మామూళ్లు వసూలు చేసుకుంటున్నట్లు బాధిత వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండి ఉండాలంటే.. వారంలో మూడు రోజులు వచ్చే ఆదాయాన్ని తమకు చెల్లించాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

టీడీపీ వర్సెస్ జనసేన

విష్ణు నివాసం వద్ద బంకుల ఏర్పాటు కోసం ఇటీవల టీడీపీ, జనసేన నేతలు ఘర్షణ పడ్డారు. ఓ జన సేన నాయకుడి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్త అక్కడ బంకు ఏర్పాటు చేసుకున్నారు. తర్వాత ఆ బంకుపై జనసేన జెండా కట్టాడు. దీన్ని గమనించిన టీడీపీ నాయకుడు రగిలిపోయాడు. ఎవరి అనుమతితో ఇక్కడ బంకు పెట్టావ్..? అంటూ చిందులు తొక్కాడు. ఆపై బంకును తొలగించాడు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే వద్ద కూడా పంచాయితీ జరిగింది. తర్వాత పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదైనట్టు తెలిసింది.

న్యూస్‌రీల్

ఫలించిన ఎంపీ గురుమూర్తి కృషి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ (ఫైల్)

తిరుపతి(అలిపిరి): తిరుపతికి రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌లు పెంచేందుకు ఎంపీ గురుమూర్తి చేసిన కృషి ఫలించింది. ఈ నెలాఖరు నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో మరో రెండు జనరల్ కోచ్‌లను పెంచాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంట్‌లో రైల్వే బడ్జెట్‌పై జరిగిన చర్చలో జర్నలిస్టులకు, సీనియర్ సిటిజన్లకు కోవిడ్ సమయంలో తొలగించిన రాయితీతోపాటు, పలు స్టేషన్లలో నిలిపివేసిన రైళ్ల స్టాపింగ్‌ను పునరుద్ధరించాలని ఎంపీ కోరారు. వీటిపై సైతం రైల్వేశాఖ సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రైల్వేశాఖకు ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్‌లో వాదన వినిపించినట్లు వెల్లడించారు.

నేషనల్ కాన్ఫరెన్స్‌లో వెటర్నరీ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : బెంగళూరులోని వెటర్నరీ కళాశాలలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ మీట్ సైంటిస్ట్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ అనే అంశంపై నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో తిరుపతి ఎస్వీ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పలు పోటీల్లో ఏకంగా ఏడు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఓరల్ ప్రజెంటేషన్‌లో కె.సుధీర్ ప్రథమ స్థానం, పి.నస్వర్‌ఖాన్ ద్వితీయ స్థానం, వి.మోనీషా, జి.విజయభాస్కర్ రెడ్డి తృతీయ స్థానం సాధించారు. అలాగే పోస్టర్ ప్రజెంటేషన్‌లో ఎం.వరలక్ష్మీ, కే.ఆకాష్ ప్రథమ స్థానంలో నిలువగా, యూ.రేణుక తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అసోసియేట్ డీన్ జగపతి రామయ్య అభినందించారు.

నేడు బీసీల ర్యాలీ

తిరుపతి కల్చరల్: సమగ్ర జనగణన, కులగణన చేపట్టడంతో పాటు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారీ ర్యాలీ చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజా తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు డీబీఆర్ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. దేశంలో 52 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు మండల్ సిఫార్సుల మేరకు 1993 నుంచి 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయన్నారు. సమగ్ర కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నేతలు జగదీష్, మధు ఆచారి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. గత సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా జేసీ శుభం బన్సల్ పలు ఆదేశాలు జారీ చేశారు. అర్జీదారులకు కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలో వసతుల కల్పిస్తారో లేదో చూడాల్సి ఉంది.

28 నుంచి కార్తీక బ్రహ్మోత్సవాలు

- కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రేపు

చంద్రగిరి (తిరుచానూరు) : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టనున్నారు. అందులో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలంతో ఆలయం అంతటా ప్రోక్షణం జరిపించనున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా కల్యాణోత్సవం, ఊంజలసేవను రద్దు చేశారు. అలాగే డిసెంబర్ 8వ తేదీ వరకు ఆలయంలో అన్ని ఆర్జిత సేవలు, కుంకుమార్చన, వేదాశీర్వచనం, విఐపీ బ్రేక్ దర్శనాలను సైతం టీటీడీ రద్దు చేసింది.



27న లక్ష కుంకుమార్చన

కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయంలో లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కుంకుమార్చన జరిపించనున్నారు. గృహస్తులు(ఇద్దరు) రూ.1,116 చెల్లించి సేవలో పాల్గొనవచ్చు. ఈ మేరకు ఆలయం వద్ద కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో భక్తులు టికెట్ పొందవచ్చని అధికారులు తెలిపారు.

వసతి.. అధోగతి!

జిల్లాలోని వసతి గృహాలు అధోగతి పాలవుతున్నాయి. అసలే చలి కాలం.. హాస్టళ్ల కిటికీలకు తలుపులు లేవు.. పడకేసిన పారిశుధ్యం.. అడుగడుగునా నిర్లక్ష్యం.. కానరాని నీటి సదుపాయం.. తలుపులు లేని మరుగుదొడ్లు.. కుళాయిలకు లీకేజీలు.. ఆరుబయటే చన్నీటి స్నానం.. నేల పైనే నిద్రించాల్సిన దుస్థితి. ఇది జిల్లాలోని సాంఘిక, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో కనిపిస్తున్న దయనీయ పరిస్థితులు. అరకొర సదుపాయాలతో వేలాది మంది పేద విద్యార్థులు వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులతో కాలం వెళ్లదీస్తున్నారు. వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాలని న్యాయస్థానాలు ఆదేశించినా కూటమి పాలకులు, అధికారుల్లో చలనం మాత్రం కరువైంది. సాక్షి బృందం పరిశీలనలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలపై ప్రత్యేక కథనం.

- సమస్యలతో విద్యార్థుల సహవాసం
- పారిశుధ్యం అధ్వానం
- తలుపుల్లేని మరుగుదొడ్లతో తప్పని అగచాట్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : పేద విద్యార్థులకు అండగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వం అన్నింటా...చిన్న చూపు చూస్తోంది. జిల్లాలోని వసతి గృహాల్లో ఎక్కడ చూసినా సమస్యలు తాండవిస్తున్నాయి. సంక్షేమ వసతి గృహాల్లో వెలగని బల్బులు... తలుపుల్లేని కిటికీలే కనిపిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణకు నిధుల్లేక వార్డెన్లు చేతులెత్తేశారు. మెనూ సరిగ్గా అమలుకావడం లేదు.

బినామీ ఉద్యోగులు

చిత్తూరు నగరం సంజయ్‌గాంధీనగర్‌లో ఉన్న ఎస్సీ ప్రీ-మెట్రిక్ వసతి గృహంలో బినామీ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఒక్క వసతి గృహంలోనే కాదు పలు సాంఘిక సంక్షేమ, బీసీ వసతి గృహాల్లో వంటమనిషి, కామాటిల కొరత ఉండడంతో వార్డెన్‌లు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నారు. మరికొన్ని చోట్ల రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నా వారు పది రోజులకు ఒకసారి వారు వచ్చి పర్యవేక్షించి వెళ్తుంటారు.



శిథిలావస్థలో తిరుపతి చెన్నారెడ్డికాలనీలోని బాలికల వసతిగృహం-2 భవనం

సాక్షి పరిశీలనలో వెలుగుచూసిన అంశాలు

- తిరుపతి నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల్లో తరచూ కలుషితమైన ఆహారం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు.
- తిరుపతి నియోజకవర్గంలోని 6 బీసీ వసతి గృహాల్లో 722 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఐదు నెలలుగా మెస్ బిల్లులు అందలేదు. వార్డెన్లు అప్పులు చేసి భోజనం పెట్టాల్సిన దుస్థితి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. విద్యార్థులు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు.
- వెంకటగిరి నియోజకవర్గంలోని వసతిగృహాలు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి.
- సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం ఎస్సీ వసతిగృహంలో ప్రహరీగోడకు గేటు లేనందువల్ల ఆకతాయిలు వసతిగృహంలో మద్యం తాగుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరింది.
- సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తడ మండలం మాంబట్టులో బీసీ హాస్టల్ భవనం పైకప్పు పడిపోయింది. అత్తివరంలో అద్దెభవనంలో బీసీ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పట్నంలోని బీసీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పట్టుకుని గడుపుతున్నారు.

సొంత డబ్బుతో సరుకులు

జిల్లాలోని 30 శాతానికి పైగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో టెండర్ల సమయం ముగిసింది. దీంతో టెండర్ దారులు నిత్యావసర వస్తువులను నిలిపివేశారు. మరికొన్ని చోట్ల పెరిగిన ధరలకు అనుగుణంగా నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ఇస్తేనే సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. టెండర్లు నిలిచిన వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో వార్డెన్‌లు రోజుకు రూ.2 వేల వరకు ఖర్చు చేసి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్నారు.

ఆరుబయటే..


వసతి గృహాల్లో సరైన మరుగుదొడ్లు, స్నానపుగదులు లేకపోవడం, కొన్ని చోట్ల ఉన్నా తలుపులు విరిగిపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు ఆరుబయటే స్నానం చేస్తున్నారు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెట్లు, పుట్ల వెంట పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళ బయటకు వెళితే విషపురుగుల బారిన పడతామేమోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

తిరుపతి జిల్లాలో హాస్టళ్ల వివరాలు

ఎస్సీ వసతి గృహాలు	62
ఎస్టీ వసతి గృహాలు	07
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	11
బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలు	64
ట్రైబల్ గురుకులాలు	06
మహాత్మాగాంధీ పూలే గురుకులాలు	07
ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	03

భద్రత కరువు

బాలికల వసతి గృహాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయకపోవడంతో బాలికలు అభద్రతా భావంతో బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గతంలో పలు హాస్టళ్లల్లో రాత్రి వేళల్లో ఆగంతకులు, ఆకతాయిలు, మందుబాబులు చొరబడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. బాలికల హాస్టళ్లల్లో పురుషులను సిబ్బందిగా, ట్యూటర్లుగా నియమించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడం లేదు.



తడ మండలం మాంబట్టు బీసీ వసతి గృహంలో ఊడిపోయిన పైకప్పు

అలంకారంగా ఆర్వో ప్లాంట్లు

వసతి గృహాలకు దాతలు ఇచ్చిన ఆర్‌వో ప్లాంట్లు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేయలేదు. భోజనం చేసే సమయంలో మంచినీరు అందుబాటులో లేకపోవడంతో చేతిపంపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. భోజనం తినేందుకు ప్లేట్లు లేకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. సొంత భవనాలు లేని వసతి గృహాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ పెట్టెలు, వస్తువుల వద్దే నిద్రించాల్సిన దుస్థితి. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం చదువుకోవడానికి సరైన వసతుల్లేవు.



తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని బాలుర హాస్టల్‌లో విరిగిన టాయిలెట్ తలుపు



తిరుపతి చెన్నారెడ్డికాలనీలోని బాలుర వసతి గృహంలో విరిగిపోయిన తాగునీటి కొళాయిలు

బ్రహ్మమొక్కటే.. పర బ్రహ్మమొక్కటే



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి వేషధారులతో కలిసి కళాకారుల ప్రదర్శన

- ఎస్వీయూలో అలరించిన కోలాటం
- ఆకట్టుకున్న 1,250మంది కళాకారుల ప్రదర్శన
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

తిరుపతి సిటీ: బ్రహ్మమొక్కటే.. పరబ్రహ్మమొక్కటే అంటూ చేపట్టిన సామూహిక కోలాట నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. ఆదివారం ఎస్వీయూ వేదికగా అన్నమయ్య డాన్స్ అకాడమీ కన్వీనర్ రాంబాబు ఆధ్వర్యంలో వర్సిటీలోని జ్ఞానప్రద వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట 1,250మందితో నృత్య ప్రదర్శన నిర్వహించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో చేపట్టిన ఈ విశిష్ట కార్యక్రమాన్ని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎస్ఎస్‌యూ వీసీ కృష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తన బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే గీతం సమస్త జగత్తులో అందరూ సమానమేని చాటుతుందని వెల్లడించారు.

అరుదైన ఘట్టం

అన్నమయ్య సంకీర్తనను దాదాపు 1,250మంది కోలాట కళాకారులు నృత్య ప్రదర్శనతో ఆలపించడం అరుదైన ఘట్టమని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు బి.నరేంద్రగౌడ్, అరుణ్‌కుమార్ కొనియాడారు. ఈ ప్రక్రియను రికార్డ్స్‌లో నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు అభినందనలు తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను ముఖ్య అతిథులు చేతుల మీదుగా నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఆర్‌కే అబాకస్ అధినేత రామకృష్ణారెడ్డి, ఇంజినీర్ తాండవకృష్ణ, డాక్టర్ ఆనంద్, రవీంద్రబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అద్భుతంగా కోలాట నృత్యం

కళాకారులు చేపట్టిన సామూహిక కోలాట నృత్య ప్రదర్శన వీక్షకుల మనసును చూరగొంది. అన్నమయ్య సంకీర్తనలు, కోలాటాల సవ్వడి, అందెల రవళితో వర్సిటీ ప్రాంగణం మార్మోగింది. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ప్రదర్శనను వీక్షించి పరవశించారు.



కోలాట ప్రదర్శనలో కళాకారులు

క్లుప్తంగా

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వారాంతపు సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని సుమారు 30వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 స్పెషల్ ఎంట్రన్స్ ద్వారా 3,216మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 3,340మంది భక్తులు దర్శించుకున్నట్లు వెల్లడించారు. అదే విధంగా రూ.500 రాహుకేతు సర్పదోష పూజలు 2,723, రూ.750 పూజలు 1,115, రూ.1,500 పూజలు 339, రూ.2,500 పూజలు 279, రూ.5వేల పూజలు 55 జరిగినట్లు వివరించారు. ఈ క్రమంలోనే కార్తీక మాసం సందర్భంగా భరద్వాజ తీర్థం, శుక బ్రహ్మాశ్రమంలో వనభోజన మహోత్సవాలు నిర్వహించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

– శ్రీకాళహస్తి నుంచి చెన్నైకి తరలింపు



రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక ఇసుక డంప్

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పరిధిలోని స్వర్ణముఖి నది ఇసుకాసురులకు కాసులు కురిపిస్తోంది. ఉచిత ఇసుక పాలసీని అడ్డం పెట్టుకుని యథేచ్ఛగా ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. ముందుగా పట్టణంలోని చెన్నై రోడ్డులో ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంకు, తంగేళ్లపాళెం, తెలుగు గంగ కాలువ ప్రాంతాల్లో ఇసుక, గ్రావెల్‌ను డంప్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుట్టుగా చెన్నైకి తరలించేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌తో రోజూ మూడు లోడ్లను అక్రమంగా చెన్నై చేరుస్తూ రూ.లక్షలు పోగేసుకుంటున్నారు. ఈ వ్యవహారం మొత్తం తెలిసినా అధికారులు మాత్రం గృహావసరాలకు ఇసుక తీసుకెళ్లవచ్చని తాపీగా వివరిస్తుంటారు. అక్రమ రవాణా వెనుక కూటమి నేతల హస్తం ఉన్నట్లు పట్టణవాసులు బహిరంగంగానే చర్చించుకుంటూ ఉండడం గమనార్హం. ఇసుక డంప్‌లపై పోలీసులకు సమాచారం అందినా, రెవెన్యూ అధికారుల సహకారంతో సీజ్ చేస్తామని చెప్పినట్లు తెలిసింది.

విజయవాడకు వెళ్లిన 108 ఉద్యోగులు

తిరుపతి తుడా: తమ డిమాండ్ల సాధన కోసం 108 ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం విజయవాడ వేదికగా రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమానికి 108 ఉద్యోగుల అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఆదివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి 108 ఉద్యోగు సంఘ నాయకులు తరలి వెళ్లారు.

తిరుపతి జీవకోనలోని విశ్వం విద్యాసంస్థలో నిర్వహించిన సాక్షి మ్యాథ్స్‌బీ పోటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సాక్షి మ్యాథ్స్‌బీ.. స్పెల్‌బీకి విశేష స్పందన

● నాలుగు కేటగిరీల్లో రౌండ్–2 పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి వేదికగా మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్, స్పెల్‌బీ రౌండ్–2 పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇదివరకు పాఠశాల స్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రౌండ్–2 పరీక్షలను జీవకోనలోని విశ్వం విద్యాసంస్థలో చేపట్టారు. తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యంతో కలిసి పరీక్షలకు ఉత్సాహంగా హాజరయ్యారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు గణితం, ఆంగ్లం ఈ రెండింటిపై పట్టు తప్పనిసరి. గణితంలో ఫార్ములాలు, ఆంగ్ల భాషలో నైపుణ్యం ఉంటే ఉన్నతంగా రాణించడం సాధ్యం. వీటి ప్రాధాన్యతను గుర్తించిన సాక్షి మీడియా గ్రూప్ గణితం, ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించి ఆ రెండు సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించేలా వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏటా మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి (రౌండ్–1), క్వార్టర్ ఫైనల్(రౌండ్–2), సెమీ ఫైనల్ (రౌండ్–3), ఫైనల్స్ (రౌండ్–4) విభాగాల్లో పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు నగదు, ఇతర ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ ఏడాది ఈ రెండు పరీక్షలకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వేఫీ, అసోసియేషన్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి వ్యవహరిస్తోంది.

మ్యాథ్స్‌బీ ..

మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉదయం 10నుంచి 11గంటల వరకు నాలుగు కేటగిరీలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై తమ మేధస్సుకు పదును పెట్టారు.

స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్...

ఇదివరకు పాఠశాల స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రౌండ్–2 పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు నాలుగు కేటగిరీలో ఈ పరీక్ష జరిగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. స్పెల్‌బీ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. ఇంగ్లిష్ భాషపై తమకున్న పట్టు, ప్రతిభను పరీక్షించుకున్నారు. స్పెల్‌బీ ద్వారా తమలో నైపుణ్యం, సామర్థ్యం పెరిగిందని, భాషపై పట్టు సాధించామని, కొత్త పదాలు, స్పెల్లింగులు, పదాల ఉచ్ఛారణ వంటి కొత్త విషయాలు తెలుసుకుంటున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను మరింత నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు సాక్షి ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కొనియాడారు.

సులవుగా గణితం



సాక్షి మీడియా గ్రూప్ అందించిన మ్యాథ్ బీ మెటీరియల్‌ను రోజూ సాధన చేయడంతో గణితం చాలా సులువుగా అనిపించింది. ఈ మెటీరియల్‌లోని ఫార్ములాలు, వాటిని ఎలా పరిష్కరించాలో సులభతరంగా ఉన్నాయి. గణితం అంటే ఇప్పుడు నాకు చాలా ఈజీ సబ్జెక్టుగా మారింది. థ్యాంక్స్ టూ సాక్షి.

– సి.లేఖ్య, 7వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుపతి

మ్యాథ్స్‌పై పట్టు



మ్యాథ్స్ సబ్జెక్టు అంటే నాకు ఇష్టం. అయితే అందులో కొన్ని నాకు అర్థం అయ్యేవి కాదు. మ్యాథ్స్‌బీ పరీక్షలో మొదటి సారి పాల్గొంటున్నా. మ్యాథ్స్‌బీ మెటీరియల్ ద్వారా చాలా నేర్చుకున్నా. తెలియని వాటిని టీచర్లను అడిగి తెలుసుకున్నా. మ్యాథ్స్‌బీ మెటీరియల్ ద్వారా గణితంపై మరింత పట్టు సాధించా.

– ప్రేమ్‌లోహిత, 5వ తరగతి, విశ్వం స్కూల్, తిరుపతి

ఉచ్ఛారణ తెలిసింది



స్పెల్‌బీ పరీక్షలో తొలి సారిగా పాల్గొన్నా. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచి క్వార్టర్ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. పాఠ్యాంశాల్లోని ఇంగ్లిష్ పదాలతో పాటు ఇతర కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్, ఉచ్ఛారణ తెలిసింది. ఇంగ్లిష్ భాషపై పట్టుతో పాటు మరింతగా నైపుణ్యం సాధించేందుకు స్పెల్‌బీ నాకు బాగా ఉపయోగపడింది.

– పి.జోషితారెడ్డి, 5వ తరగతి, విశ్వం విద్యాసంస్థ, తిరుపతి

కొత్త పదాలను తెలుసుకున్నా



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ఇదో మూడో సారి. అయినా ప్రతి ఏటా ఇంగ్లిష్ భాషలోని కొత్త పదాలను తెలుసుకుంటున్నా. వాటి స్పెల్లింగ్ నేర్చుకుంటున్నా. ఎలా ఉచ్ఛరించాలని మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్ పరీక్షను బాగా రాశా.

– పి.జాయ్‌లిన్ మెర్సీ, 10వ తరగతి, క్యాంఫోర్డ్(ఈస్ట్) స్కూల్, చిత్తూరు

ఆసక్తి మరింత పెరిగింది



స్పెల్‌బీ పరీక్షలో తొలిసారిగా పాల్గొన్నా. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచి క్వార్టర్ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడంతోపాటు మరింతగా నైపుణ్యం సాధించాలనే ఆసక్తి కలిగింది. థ్యాంక్స్ టూ సాక్షి.

– కె.సారాజేన్, 7వ తరగతి, క్యాంఫోర్డ్(వెస్ట్) స్కూల్, చిత్తూరు

పోటీ ప్రపంచంలో రాణించేందుకు..



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు సబ్జెక్టు పరంగానే కాకుండా అన్ని అంశాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి. కొంత మంది విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్ అంటే కొంత భయం ఉంటుంది. సరైన విధానంలో వారికి బోధించకుంటే ఈ భయం మరింత పెరుగుతుంది. వారిలో ఆసక్తి పెంపొందించి రాణించేందుకు సాక్షి నిర్వహిస్తున్న మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ దోహదపడుతుంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు మరిన్ని కార్యక్రమాలు సాక్షి చేపట్టాలని కోరుకుంటున్నా.

– ఎన్.విశ్వచందన్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్, విశ్వం విద్యాసంస్థ, తిరుపతి

ఫైనల్స్‌కు వెళ్లడమే లక్ష్యం



స్పెల్‌బీ పరీక్షలో మొదటి సారి పాల్గొంటున్నా. స్పెల్ బీ మెటీరియల్‌లో చాలా కొత్త పదాలున్నాయి. వాటిని ఎలా ఉచ్ఛరించాలి, స్పెల్లింగ్స్ తెలుసుకున్నా. ఇంగ్లిష్ భాషపై మంచి పట్టు సాధించడానికి స్పెల్‌బీ ఎంతో దోహదపడుతోంది. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచి రౌండ్–3, రౌండ్–4లో ప్రతిభ కనబరచి ఫైనల్స్ చేరడమే లక్ష్యం.

– మూడే సంహిత, పి.దీక్షారెడ్డి, 8వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుపతి

29న నృసింహునికి చందనాలంకరణ



పెంచలకోన క్షేత్రం

రాపూరు : పెంచలకోనలో వెలసిన పెనుశిల శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఈనెల 29వ తేదీన చందనాలంకరణలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ శ్రీవారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సుప్రభాతం, శాంతిహోమం, కల్యాణం, బంగారు గరుడసేవ జరిపించనున్నట్లు వెల్లడించారు.

చెంగాళమ్మ సేవలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్



అమ్మవారి ఆలయంలో సురేష్‌రెడ్డి

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆదివారం సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు ఈఓ బి.ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డిని పలువురు బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట, దిగవూరు, ఎగవూరు పంచాయతీల పరిధిలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. వరి పంటతోపాటు చెరుకు, మామిడి తోటలను ధ్వంసం చేసింది. ప్రస్తుతం గజరాజులు భాకరాపేట అటవీప్రాంతంలోకి వెళ్లినట్లు రైతులు చెబుతున్నారు. ఎప్పుడు మళ్లీ పంటలపై పడతాయో అని ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇప్పించాలని విన్నవిస్తున్నారు.

అన్నమయ్య కీర్తి విశ్వశోభితం



అన్నమయ్య జాతీయ పురస్కారాలు అందుకున్న కవులు, కవయిత్రులు

తిరుపతి కల్చరల్: పదకవితా పితామహుడిగా అన్నమయ్య కీర్తి విశ్వశోభితమని ఆచార్య వి.కృష్ణవేణి, సహాయక ఆచార్య వై.విజయలక్ష్మి తెలిపారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో యూత్ హాస్టల్లో ఆదివారం అన్నమయ్యపై జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఏకతత్వాన్ని భక్తి తత్వంగా కొలిచిన వాగ్గేయకారుడిగా అన్నమయ్య ప్రసిద్ధి చెందారన్నారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.నారాయణస్వామి, జిల్లా అధ్యక్షుడు పాలకూరు కన్నయ్య మాట్లాడుతూ శ్రీవారి లీలను కీర్తించి ముక్తికి భక్తి ముఖ్యమని అన్నమయ్య ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. డాక్టర్ సుభాషిణి, డాక్టర్ కేసీ లావణ్య మాట్లాడుతూ అన్నమయ్య 32 వేల కీర్తనలు రచించారని వెల్లడించారు. ఆముదాల మురళి, రచయిత గొడుగు చింత గోవిందయ్య మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు కలియుగాంతం వరకు ఉంటాయన్నారు. అనంతరం కవులకు డాక్టర్ మద్రిపూడి దేవేంద్రరావు అన్నమయ్య జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. డాక్టర్ ఎ.కోమల, డాక్టర్ బత్తుల శ్రీరాములు, డాక్టర్ నందిపాటి చక్రపాణి, ఎం.పురుషోత్తమాచారి, సోము ఉమాపతి, కిట్టన్న, యువశ్రీ మురళి, పద్మ ప్రపూర్ణ, వడ్డి జగదీష్, పవిత్ర, గోవిందన్, పేరూరు బాలసుబ్రమణ్యం, రెడ్డెప్ప, సినీ దర్శకులు బీపీ సోమసుందరం పాల్గొన్నారు.

ప్రమాదం చిన్నది.. కేసు పెద్దది!

తిరుపతి రూరల్ : మండలంలోని వేదాంతపురం సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రెండు కార్లు ప్రమాదశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరూ గాయపడలేదు. అయితే వాహనాల రాకపోలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు ఓ హెడ్ కానిస్టేబుల్ వచ్చారు. అయితే కారు ప్రమాదంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నలుగురు యువకులు సదరు పోలీసుపై చిరాకుపడి కాలర్ పట్టుకుని దురుసుగా ప్రవర్తించారు. దీనిపై హెడ్ కానిస్టేబుల్ పై అధికారులకు ఫిర్యాదు చేయగా, యువకులపై క్రిమినల్ కేసు నమోదైంది. వివరాలు.. సుండుపల్లెకు చెందిన సాయికుమార్ తన కుటుంబంతో కలిసి ఆర్‌సీ పురం నుంచి తిరుపతికి కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో వేదాంతపురం కూడలి వద్ద చంద్రగిరి నుంచి రేణిగుంట వైపు వస్తున్న కారు ఢీకొంది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే సమయంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు హెడ్ కానిస్టేబుల్ కోదండరామయ్య, మరో నలుగురు సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చారు. అదే ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న యువకులు జయచంద్రారెడ్డి, మునిబాలాజీ, అన్వర్‌బాషా, లోకేష్‌రెడ్డి అసహనంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో హెడ్ కానిస్టేబుల్ కోదండరామయ్య తన విధులు అడ్డుకున్నారని, సెల్‌ఫోన్ , మ్యాన్‌ప్యాక్‌ను లాక్కునేందుకు యత్నించారని, చొక్కా పట్టుకున్నారని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు యువకులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. యువకుల ప్రవర్తన కారణంగా ప్రమాదమనే చిన్న కేసు కాస్తా, క్రిమినల్ కేసుగా మారి పెద్దదైందని పలువురు పోలీసులే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. క్షణికావేశంలో పోలీసులపై మండిపడ్డామని, అసలే ప్రమాదం జరిగి బాధలో ఉన్న తమపై క్రిమినల్ కేసు నమోదు చేయడం భావ్యం కాదని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన అనస్తీషియా నేషనల్ కాన్ఫరెన్స్

తిరుపతి తుడా : బీహార్‌లోని పాట్నాలో వారం రోజులగా నిర్వహిస్తున్న అనస్తీషియా నేషనల్ కాన్ఫరెన్స్ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల అనస్తీషియా విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస రావు పాల్గొన్నారు. దేశం నలుమూలల నుంచి సుమారు 60 మంది వైద్యులు హాజరైన కాన్ఫరెన్స్‌లో ఆయన పలు అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. శ్రీనివాసరావు మాటాడుతూ నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడే పద్ధతులపై సామాన్య ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక బృందాన్ని తయారుచేసినట్లు వెల్లడించారు. 7801011972 నంబర్‌కు ఫోన్ చేస్తే తమ టీమ్ వారికి శిక్షణ ఇస్తుందని వివరించారు.


జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి సిటీ : తిరుపతి అగ్రికల్చరల్ కళాశాల మైదానంలో ఆదివారం రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్పీ సుబ్బరాయుడు ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉండే పాత్రికేయులు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం తరచూ క్రీడాపోటీల్లో పాల్గొనాలని సూచించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర జట్టు విజయం సాధించి శ్రీవారి కప్‌ను కైవసం చేసుకుని చాంపియన్‌గా నిలిచింది. క్రీడల ముగింపు కార్యక్రమానికి ఆర్థోపెడిక్ డాక్టర్ సుకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాయి సుధా మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నేతలు బొల్ల సతీష్, ఓబులం ప్రసాద్, వేణుగోపాలరావు, తలారి రెడ్డప్ప, తలారి నాగలింగస్వామి, సాపాటి ప్రకాష్, సురేంద్ర, అబ్దుల్ బాయ్, అజయ్ ఇండియన్, నాగవర్ధన్, విజయ్, జగదీష్, పద్మనాభంపాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి మంగళం : క్రీడలతో మానసిక అభివృద్ధితో పాటు ఉజ్వల భవిత ఉంటుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఆదివారం మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో 68వ బేస్ బాల్ అండర్ 14 కాంపిటీషన్ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి 13 జిల్లాల నుంచి విద్యార్థులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు. గతంలో కంటే భిన్నంగా క్రీడల ప్రోత్సాహకానికి శ్రీకారం చుట్టామని రవినాయుడు తెలిపారు రాబోయే ఒలింపిక్స్‌కు మన తెలుగు ఆణిముత్యాలను అంతర్జాతీయ వేదికపైకి పంపడానికి ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. అమిగోస్ బిల్డర్స్ ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈసారి జరిగే ఒలింపిక్స్‌లో దేశానికి బంగారు పతకం రావాలని కోరుకుంటున్నానన్నారు. ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ భాను, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శులు బాబు, రామకృష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, హెచ్ఎం కేశవులునాయుడు, సాంఘిక ఉపాధ్యాయులు కృష్ణమనాయుడు, ఉత్తమ పీఈటీ అవార్డు గ్రహీత ప్రభాకర్, పూర్ణచంద్ర, టిడిపి నాయకులు ఈశ్వరయ్య, తెలుగు యువత అధ్యక్షులు జ్యోతికృష్ణ, జనార్ధన్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేతలపై కేసు



పట్టుబడిన మద్యంతో ఎక్సైజ్ అధికారులు

తిరుపతి క్రైమ్: తిరుపతిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామచంద్ర తెలిపారు. ఆదివారం ఉమ్మడి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సంయుక్తంగా కలిసి దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. తిరుపతి టౌన్ క్లబ్ సమీపంలోని ఇందిరా నగర్లో గణేష్ అనే వ్యక్తి వద్ద ఆర్మీకి సంబంధించిన 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే రైల్వే స్టేషన్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న కలకడకు చెందిన వ్యక్తి నుంచి 10 సీసాలు పట్టుబడ్డాయని వివరించారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైపీ పవన్ కుమార్, ఎస్ఐలు పృథ్వీ, జయశంకర్, మహేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,147 మంది స్వామివారిని దర్శించుకోగా 28,096 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 10 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.